

నిజామాబాద్‌లో ముసుగులేని రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలు

# 'కోడ్' కూసినా.. నిద్రలేవని యంత్రాంగం

- నిజామాబాద్ జిల్లాలో అమలుకాని ఎన్నికల నియమావళి
- కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ పట్టింపు కరువు...
- జాతీయ నేతల విగ్రహాలకు ముసుగు వేయడంలో నిర్లక్ష్యం

నిజామాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల కోడ్‌ను అమలుచేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జనవరి 29న షెడ్యూల్ విడుదలైంది. దీంతో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఎన్నికల సంఘం చెప్పినట్లు పని చేయడం జిల్లా ఎన్నికల అధికారులుగా కలెక్టర్ల బాధ్యత. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి కరీంనగర్ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా ఉన్నప్పటికీ నిజామాబాద్, కామారెడ్డి వంటి జిల్లాల్లో అక్కడి కలెక్టర్లే జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తుంటారు.ఎమ్మెల్సీ ఎన్నికలకు అదనపు రిటర్నింగ్ అధికారులుగానూ బాధ్యతలు నిర్వహిస్తారు. ఎన్నికల ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంటుంది. కానీ క్షేత్ర స్థాయిలో ఎన్నికల కోడ్ పూర్తిస్థాయిలో అమలుకావడంలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే వెంటనే జాతీయ నేతల విగ్రహాలకు ముసుగు తొడగడం ఆనవాయితీ. ఈసీ ఎన్నో దశాబ్దాలుగా ఈ నిబంధనను అమలుచేస్తున్నది. నిజామాబాద్ జిల్లాలో మాత్రం అలాంటిదేమీ కనిపించడం లేదు. ఈసీ ఆదేశాలతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి వారం రోజులు గడుస్తున్నా, జిల్లా కేంద్రంలోని జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగు తొడగలేదు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈసీ నిబంధనలను అమలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ నేతల విగ్రహాలకు ముసుగు వేసి ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తున్నారు.

## గతంలోనూ వివాదాస్పదమే..

లోక్‌సభ ఎన్నికల సందర్భంలోనూ నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారుల తీరు వివాదాస్పదమైంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఐఎంఏ భేటీ కావడం తప్పు కాకపోవచ్చు, కానీ ఐఎంఏలో సభ్యులుగా ఉన్న ప్రభుత్వ వైద్యులు స్వయంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి, బీజేపీ ఎమ్మెల్యేతో భేటీ కావడం ముమ్మాటికి కోడ్ ఉల్లంఘనే. ఈ విషయాన్ని నమస్తే తెలంగాణ పత్రికనే వెలుగులోకి తీసుకువచ్చింది. నాడు జిల్లా రిటర్నింగ్ అధికారి స్పం దించి విచారణకు ఆదేశించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ లోతుగా వివరాలు సేకరించి కలెక్టర్‌కు పంపారు. సదరు ఘటనలో నలుగురైదుగురు ప్రభుత్వ వైద్యులు ఉన్నప్పటికీ ఆ విషయాన్ని మరుగున పెట్టేయడంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇంత వరకూ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి గల కారణాలు ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదు. నిజామాబాద్‌లో కొంత మంది ఉన్నతాధికారుల పట్టింపులేని తనం మూలంగా ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతున్నది.

## ముసుగేశారు..



*ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కామారెడ్డిలో కొందరు జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగువేయలేదు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూర్తిగా ముసుగువేయకుండా తలభాగం కనిపించేలా ఉంచారు. దీనిపై అభ్యంతరాలు, విమర్శలు వెల్లువెత్తగా.. నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ముసుగేశారు..కానీ..'శీర్షికన సోమవారం ఫొటో కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. ఇందిరా గాంధీ విగ్రహానికి పూర్తిగా ముసుగువేశారు.*

*-కామారెడ్డి, ఫిబ్రవరి 3*

## ఈసీ ఆదేశాలకే తూట్లు..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈసీ ఆదేశాలను అమలు చేసేందుకు చర్యలు చేపట్టినప్పటికీ పలు లోపాలు బహిర్గతమవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇందిరాగాంధీ విగ్రహాన్ని పూర్తిగా కాకుండా సగానికే ముసుగేసి వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నారు. ఇక నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని గాలికి వదిలేశారు. తొడుగు వేయలేదు. ఎన్నికల కోడ్‌ను అమలు చేయలేదు. ఇదేమిటని అడిగే వారు కరువయ్యారు. కేంద్రంలో ఎన్డీయే సర్కారుకు భాగస్వామ్యపక్షమైన టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్. ముమ్మాటికీ ఆ విగ్రహానికి ముసుగువేయాల్సి ఉన్నప్పటికీ యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరించడం, జిల్లా ఎన్నికల అధికారులు కనీసం పర్యవేక్షణ చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తూ సీపీ కార్యాలయానికి కూత వేటు దూరంలో, నిజామాబాద్ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుటే ఇంతటి భారీ నిర్లక్ష్యం చోటుచేసుకోవడం గమనార్హం.

# బీసీలకు మొండి చేయి!

**కుల గణన నివేదికపై వెల్లువెత్తుతున్న సందేహాలు**

- సర్వే ప్రామాణికతను ప్రశ్నార్థకం చేసిన నివేదిక
- రిపోర్టు తప్పుల తడకగా ఉందంటున్న బీసీ సంఘాలు
- వెనుకబడిన వర్గాల జనాభా తగ్గడంపై అనుమానాలు
- కుట్రలతోనే తగ్గించారని బీసీల మండిపాటు
- 50 శాతం కోటా అమలు చేయాలని డిమాండ్




కామారెడ్డి, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కుల గణన వివరాలు అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రం లో బీసీల జనాభా 46.2 శాతమే ఉన్నట్లు చెబుతుండడంపై సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. రిజర్వేషన్ల విషయంలో అన్యాయం చేసేందుకు, ప్రభుత్వం కుట్రపూరితంగానే ఈ విధంగా తప్పుడు లెక్కలు చెబుతున్నదని బీసీ వర్గాలు మండిపడుతున్నాయి. మరోవైపు, బీసీల సంఖ్య కావాలనే తక్కువగా చూపించారని సొంత పార్టీ నుంచే రేవంత్ సర్కారుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**డిక్లరేషన్ పేరిట మోసం..**

బీసీ కుల గణన చేపట్టడంతో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ ఊదరగొట్టింది. ఆ పార్టీ అగ్ర నేతలు సైతం బీసీల పాట పాడారు. వెనుకబడిన వర్గాలకు పూర్తిగా ప్రయోజనాలు దక్కేలా చేస్తామని ఎన్నికల సభల్లో ప్రకటించారు. కామారెడ్డి వేదికగా జరిగిన కాంగ్రెస్ సభలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంపు, కాంట్రాక్టుల కేటాయింపుల్లోనూ రిజర్వేషన్లు, జ్యోతీబాపూలే పేరుతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు, బీసీ సంక్షేమానికి ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల కేటాయింపు, ప్రత్యేకంగా ఎంబీసీ మంత్రిత్వ శాఖ, ప్రతి మండలంలో బీసీ గురుకులాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక భవనాలు, ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇలా ఎన్నో వరాలు కురిపించారు. మున్నూరుకాపులకు, ముదిరాజ్‌లకు, పద్మశాలీలకు, విశ్వకర్మలకు రకరకాల హామీలు ఇచ్చారు. తీరా అమలు చేయకుండా 'చేయి'చ్చారు.

**సర్వే అంతంతే..**



బీసీ కులగణన కోసం సర్వే ప్రారంభమైనప్పటి నుంచే ఉమ్మడి జిల్లాలో అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటింటికీ తిరిగి సమాచారాన్ని సేకరించాల్సి ఉండగా, ఎన్యుమరేటర్లు అన్ని ఇండ్లకు వెళ్లలేదని తెలిసింది. మా ఇంటికి రాలేదని అప్పట్లోనే ఎంతో మంది చెప్పడం సర్వే ప్రామాణికతపై ప్రశ్నలు రేకెత్తించింది. అందుకు అనుగుణంగానే తాజాగా ప్రకటించిన బీసీ కుల గణన నివేదిక వివరాలు అనేక సందేహాలకు తావిచ్చాయి. రాష్ట్రంలో తక్కువగా ఉండే అగ్రకులాల జనాభా పెరిగినట్లు చూపడం, ఎక్కువగా ఉండే బీసీల సంఖ్య తగ్గినట్లు చూపడంతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుట్రపూరితంగానే బీసీలు, ఎస్సీలు, ఎస్టీల జనాభా తగ్గించి చూపిస్తున్నారని బీసీ సంఘాలు మండిపడుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సర్కారు సమాయత్తమవుతున్న తరుణంలో ఈ నివేదిక ఆధారంగా రిజర్వేషన్ కల్పిస్తే బీసీలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెబుతున్నాయి. 50శాతం వాటాగా స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

### పారదర్శకత లేదు



బీసీ కులగణన చేసి ఎవరి వాటా వారికి ఇస్తామని గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఊదరగొట్టారు. కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా వెల్లడించిన బీసీల కుల గణన వివరాలే అందుకు తార్కాణం. కాంగ్రెస్ పార్టీ చెప్పేది ఒకటి చేసేది మరొకటి. కాంగ్రెస్‌కు బీసీల మీద ప్రేమ లేదు. మాటల్లోనే బీసీల జపం చేస్తూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అగ్రవర్ణాలకు టికెట్లు ఇవ్వడమే ఇందుకు ఉదాహరణ. బీసీలను ఉద్ధరిస్తున్నామని మాయమాటలు చెప్పి, ఎమ్మెల్సీ టిక్కెట్లు మాత్రం రెడ్లకు ఇవ్వడంలోనే బీసీల పట్ల వారి నిబద్ధత ఏమిటో అర్థమవుతున్నది.

**-నీల నాగరాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు**

### కుల గణనలో పూర్తిగా విఫలం



రాష్ట్రంలో బీసీ కుల గణనను సంపూర్ణంగా, పారదర్శకంగా నిర్వహించడంలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కేవలం నామమాత్రంగా సర్వే చేసి సర్కారు చేతులు దులుపుకొన్నది. ఇవాళ ప్రభుత్వం చెబుతున్న లెక్కలన్నీ తప్పుల తడకే. తక్కువ జనాభా ఉండే అగ్రవర్ణాల సంఖ్య పెరిగినప్పుడు, ఎక్కువగా ఉండే బీసీల జనాభా ఎలా తగ్గుతుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా కుల గణన చేపట్టాలి. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి.

**-చెలిమల భానుప్రసాద్, బీఆర్ఎస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్**

### బీసీలకు మోసగిస్తున్న కాంగ్రెస్



కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీలను చిన్నచూపు చూస్తున్నది. కులగణన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీసీలను మోసంగించేందుకు యత్నిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలన్న వక్రబుద్ధితో కుల గణన చేపట్టింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్వే ఆధారంగా కుల గణనలో వచ్చిన లెక్కల ప్రకారం బీసీలకు సీట్లు కేటాయించాలి.

**-బల్వంత్‌రావు, బీఆర్ఎస్ నేత**

### ఇది రెడ్ల కాంగ్రెస్



రాష్ట్రంలో ఉన్నది రాహుల్ కాంగ్రెస్ కాదు.. రెడ్ల కాంగ్రెస్. పదవులు, టికెట్లు అగ్రవర్ణాలకే ఇస్తున్నారు. బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ఎందుకు అమలు చేయడం లేదు. తెలంగాణలో 136 బీసీ కులాలు ఉన్నాయి. కానీ తాజా లెక్కల్లో మాత్రం తక్కువ జనాభా ఉన్నట్లు చూపడం వెనుక కుట్ర దాగి ఉన్నది. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవ దూరంగా ఉన్నాయి. వెనుకబడిన వర్గాలను మళ్లీ మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది.

**-సాప శివరాములు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు**

### అంతా అసంపూర్తి సమాచారమే..



కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన మొత్తం అసంపూర్తిగా ఉంది. సర్వే మొదలైనప్పటి నుంచే అనుమానాలు నెలకొన్నాయి. కుల గణన సందర్భంగా కొన్ని ఇండ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తే, మరి కొన్ని ఇండ్లకు అసలు వెళ్లనే లేదు. ఏదో హడావుడిగా సర్వే ముగించి బీసీల సంఖ్య తక్కువగా ఉందని చూపడం కుట్రే. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాల్సిందే. కుల గణన విషయంలో ప్రభుత్వం మరింత పారదర్శకంగా ఉండాలి.

**-గెరిగంటి లక్ష్మీనారాయణ, బీసీ నాయకుడు**

# అనర్హత తప్పదా?

- ఉమ్మడ జిల్లాలో జోరుగా చర్చ
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సుప్రీం నోటీసులు
- జాబితాలో పోచారం శ్రీనివాసరెడ్డి
- విచారణ 10కి వాయిదా

బాన్సువాడ, ఫిబ్రవరి 3: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పేరు కూడా జాబితాలో ఉండడమే అందుకు ప్రధాన కారణం. గత విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదా? అన్న అంశంపై జోరుగా చర్చ జరుగుతున్నది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ నేత, హుజురాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. మరోవైపు, పార్టీ ఫిరాయించిన మరో ఏడుగురు ఎమ్మెల్యేపైనా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో మరో పిటిషన్‌ను దాఖలు చేసింది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, డాక్టర్ సంజయ్‌కుమార్, అరికెపూడి గాంధీపై అనర్హత వేటు వేయాలని కోరింది. ఈ నేపథ్యంలో సోమవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు గతంలో వేసిన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని తెలిపింది. ఈ మేరకు ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. పార్టీ ఫిరాయించిన శాసనసభ్యులకు నోటీసులు జారీ కావడం, గత విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేయడంతో అనర్హత వేటు తప్పకపోవచ్చని ఉమ్మడి జిల్లాలో జోరుగా చర్చ జరుగుతున్నది.

# కూడవెల్లి వాగుకు జలకళ

- మల్లన్నసాగర్ నుంచి నీటి విడుదల
- తుజాల్‌పూర్ చెక్‌డ్యాం నుంచి పారుతున్న నీరు



తుజాల్‌పూర్ చెక్‌డ్యాం వద్ద పారుతున్న కూడవెల్లి వాగు

బీబీపేట్, ఫిబ్రవరి 3: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామశివారులో ఉన్న కూడవెల్లి వాగు జలకళ సంతరించుకున్నది. మల్లన్నవాగు నుంచి నీటి విడుదల చేపట్టడంతో కూడవెల్లి వాగులో ప్రవాహం పెరిగింది. దీంతో గ్రామరైతులు సంతోషం వ్యక్తంచేశారు. సోమవారం రైతులతో కలిసి వాగును పరిశీలించిన జడ్పీ మాజీ వైస్ చైర్మన ప‌రికి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేయడానికి మాజీ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్తం ప్రభాకర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. నీరుపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వద్దకు వెళ్లి వాగునుంచి నీటిని విడుదల చేయించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. మండలంలోని తుజాల్‌పూర్, మాల్కాపూర్, యాడారం, కోనాపూర్, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లోని వేల ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

## డబుల్ ఇండ్లకు నీళ్లొచ్చాయ్..



రాంపూర్‌లో భగీరథ నీటిని పట్టుకుంటున్న కాలనీవాసి

కోటగిరి ఫిబ్రవరి 3: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో కొన్నిరోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదు. దీంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'డబుల్' కాలనీలో నీటి కష్టాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. భగీరథ పైప్‌లైన్‌ను మరమ్మతులు చేయించి, కాలనీకి నీటిని సరఫరా చేశారు. ఏఈ ధన్‌రాజ్, స్థానిక పంచాయతీ కార్యదర్శి హన్మంత్‌రావు సోమవారం డబుల్ బెడ్‌రూం కాలనీ లో పర్యటించి, నీటి సరఫరా తీరును పరిశీలించారు.

# పౌల్ట్రీ రైతుకు 'వైరస్'దెబ్బ

- ఉమ్మడి జిల్లాలో భారీగా కోళ్ల మృతి
- రెండు మండలాల్లోనే లక్షకు పైగా మృత్యువాత
- మూతబడిన పౌల్ట్రీఫామ్‌లు
- లబోదిబోమంటున్న నిర్వాహకులు
- అంతు చిక్కని వైరస్ కారణం



భీమ్‌గల్ మండలంలో మృతి చెందిన కోళ్లు

వేల్పూర్/నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 3: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో లక్షలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి. అంతు చిక్కని వైరస్ సోకడంతో ఒక్కో పౌల్ట్రీఫామ్‌లో వేలాది కోళ్లు మృతి చెందాయి. ఒక్క భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లోనే లక్షకు పైగా మృతి చెందడంతో పౌల్ట్రీ రైతులు లబోదిబోమంటున్నారు. వైరస్ ప్రభావంతో వారం వ్యవధిలోనే దాదాపు అన్ని పౌల్ట్రీఫామ్‌లు మూతబడ్డాయి. బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో 2,500 కోళ్లు, చించోలి గ్రామంలో వెయ్యికి పైగా కోళ్లు మృతి చెందాయి. చనిపోయిన వాటిని ఎక్కడికక్కడ జేసీబీలతో గుంతలు తీసి పూడ్చి వేస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి పోషించిన కోళ్లు కండ్ల ముందే కుప్పలుకుప్పలుగా పడి చనిపోతుండడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. ఎందుకు చనిపోతున్నాయో తెలియక, ఏం చేయాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. చూస్తుండగానే షెడ్లన్నీ ఖాళీ అవుతుండడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒక కోళ్ల కంపెనీ ప్రతినిధులు శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించినట్లు తెలిసింది. మరోవైపు, ఈ వ్యవహారంపై అధికారులు మాత్రం స్పందించడం లేదు.

# ఖైదీలకు పునరావాసం కల్పించడానికే..

- వీవింగ్ యూనిట్ ఏర్పాటు
- జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా
- జిల్లా జైలులో 'కుట్టు పరిశ్రమ' ప్రారంభోత్సవం



నిజామాబాద్ సెంట్రల్ జైలులో వీవింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీజీ సౌమ్య మిశ్రా

వినాయక్‌నగర్/కామారెడ్డి, జనవరి 3: ఖైదీలకు ఉపాధి కల్పించడం ద్వారా పునరావాసానికి వీవింగ్ యూనిట్ ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. సోమవారం నిజామాబాద్ సెంట్రల్ జైలుతోపాటు కామారెడ్డి సబ్‌జైలును సందర్శించారు. కామారెడ్డి సబ్‌జైలులో ఖైదీల యోగక్షేమాలు, భోజన వసతులు, న్యాయ సేవ, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి, రికార్డులను పరిశీలించారు. సెంట్రల్ జైలులో వీవింగ్ యూనిట్(కుట్టు పరిశ్రమ)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2021 లో నిజామాబాద్ జైలును సెంట్రల్ జైలుగా అభివృద్ధి చేసి, అప్పటినుంచి ఇక్కడ స్టీల్ ఇండస్ట్రీ యూనిట్, ముద్రణ(ప్రింటింగ్, దర్జీ విభాగంతో పాటు ఫినైల్ తయారీ విభాగాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. చర్లపల్లిలో ఉన్న వీవింగ్ యంత్రాలను నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించి ఇక్కడే వీవింగ్(కుట్టు పరిశ్రమ)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ తయారు చేసిన వస్త్రాలు వరంగల్ రేంజ్‌లోని అన్ని జైళ్లకు సరఫరా చేయడంతోపాటు ప్రజలకు సైతం విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ రేంజ్ జైళ్ల శాఖ డీఐజీ ఎం.సంపత్, కామారెడ్డి ఎస్పీ, నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ పాల్గొన్నారు.



## 'స్థానిక' ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి

స్థానిక సంస్థ ఎన్నికల్లో తమకు రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.

-నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 3